క్లుప్తంగా

గంగవరం పోర్టులో భద్రతకు ప్రాధాన్యం



భద్రతా వారోత్సవాల్లో గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో జాతీయ భద్రతా వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘ కాలిక రహదారి భద్రత, సమస్యలపై దృష్టి పెట్టినట్లు పోర్టు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. గంగవరం గ్రామాన్ని ఎన్‌హెచ్-16తో కలిపేందుకు పనులు చేపట్టామన్నారు. జగ్గు జంక్షన్ నుంచి డ్రైన్లు, రోడ్డు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అదానీ గంగవరం పోర్టులో భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

దండి మార్చ్‌తో తెల్లదొరల గుండెల్లో దడ



అప్పికొండ తీరంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: దండిమార్చ్‌తో తెల్లదొరల గుండెల్లో మహాత్మా గాంధీ దడ పుట్టించారని చేపల పాలెం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. దండిమార్చ్ డేను పురస్కరించుకుని విద్యార్థులతో కలసి అప్పికొండ తీరంలో జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్వతంత్ర పోరాటంలో గాంధీ పాత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బుడగట్ల హేమంత్‌కుమార్, సోమునాయుడు, సోంబాబు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యం



పౌష్టికాహార కిట్లు అందిస్తున్న లీల

అగనంపూడి: దువ్వాడ వీఎస్‌ఈజెడ్‌లోని లీఫార్మా కంపెనీ సారథ్యంలో 79, 85, 88 వార్డుల్లోని పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లీఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీల మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 1200 మంది కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఉచిత సేవలు అందిస్తున్న లీఫార్మా డైరెక్టర్‌ను అగనంపూడి ప్రజా సంఘం నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, బండారు చందులు సత్కరించారు. లీఫార్మా ప్రతినిధులు జి.ఫణికుమార్, డాక్టర్ పి.బాబూరావు, అగనంపూడి బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బీకే రామకోటి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, నాయకులు గోపిశెట్టి పద్మ పాల్గొన్నారు.

జూన్‌లోగా టిడ్కో గృహాలకు మౌలిక వసతులు



మాట్లాడుతున్న టిడ్కో ఈఈ సుధాకర్

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గ పరిధి భానోజీతోట, బీసీ రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహాలకు జూన్‌లోగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని టిడ్కో ఈఈ సుధాకర్ తెలిపారు. టాటా ప్రాజెక్ట్ అధికారులతో కలసి టిడ్కో గృహ సముదాయాలను బుధవారం పరిశీలించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, డీఈ రాజేష్, టాటా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, మేనేజర్ రాజుబాబు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: మింది, గాజువాక ఫీడర్లు, బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ల పరిధిలో అభివృద్ధి పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మింది విలేజ్, గిరిప్రసాద్ కాలనీ, రాంనగర్, ఎస్సీ కాలనీలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యం.. గాలిలో దీపం



బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోంది. గత ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన సర్కారీ వైద్యం నేడు పేదలకు దూరమైంది. స్పెషలిస్టు వైద్యులు, ఇంటి వద్దకే వైద్య సేవలందించే ఫ్యామిలీ డాక్టర్లు కనుమరుగయ్యారు. ఏ చిన్న రోగమొచ్చినా ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఒళ్లు, ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

- గత ప్రభుత్వ చర్యలు ఒక్కొక్కటిగా కనుమరుగు
- ఫ్యామిలీ డాక్టర్, స్పెషలిస్ట్ వైద్యులకు మంగళం
- ఊసే లేని ఆరోగ్య సర్వే, వైద్య శిబిరాలు



మంచానికే పరిమితమైన పేషెంట్‌కు చికిత్స చేస్తున్న వైద్యులు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: వైద్యం పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతున్న అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా అందనంత మెరుగైన వైద్య సేవల్ని గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు అందుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చెందాయి. ఫ్యామిలీ డాక్టర్, స్పెషలిస్టు వైద్య సేవలు, అన్ని రకాల మందులు, వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్షతో అన్ని విభాగాల స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇదంతా గతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల్ని ఒక్కొక్కటిగా నాశనం చేస్తూ పూర్వపు దైన్య స్థితికి తీసుకెళ్తోంది. దీంతో రోగాలతో బాధపడుతున్న వృద్ధులు, వికలాంగులు, పిల్లలు యూపీహెచ్‌సీలకు కాళ్లు ఈడ్చుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.



తుంగ్లాంలో మంచానికే పరిమితమైన పేషెంట్‌కు గత ప్రభుత్వంలో ఇంట్లోనే చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

జాడలేని స్పెషలిస్ట్ డాక్టర్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు జ్వరం, దగ్గు, జలుబు తదితర చిన్న చిన్న రోగాలకే పరిమితమైన ప్రభుత్వ ఆస్పత్రులు మాజీ సీఎం జగన్ ఆలోచనతో స్పెషలిస్టు వైద్య సేవలకు నిలయమయ్యాయి. పలు విభాగాల స్పెషలిస్ట్ వైద్యులు స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు అందించేవారు. వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు ప్రధాన ఆస్పత్రులకు రిఫర్ చేసేవారు. ఈ విధానంలో చాలా మంది ప్రజలు సీరియస్ వ్యాధుల్ని ముందుగానే గుర్తించడంతో.. మెరుగైన చికిత్స అందుకుని, ప్రాణాలు దక్కించుకునేవారు. ఈ స్పెషలిస్టు వైద్యుల సేవల్నీ కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కింది.

ఆరోగ్య సర్వేల ఊసే లేదు!

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తం చనుగా ఆరోగ్య సర్వే చేపట్టేది. యూపీహెచ్‌సీ, సచివాలయాల ఏఎన్‌ఎం, ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసేవారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధులు, మంచం పట్టిన రోగుల వద్దకు వెళ్లి వారి బ్లడ్ నమూనాలు, బీపీ, సుగర్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేవారు. దీని ద్వారా చాలా రోగాలను ముందగానే గుర్తించి, త్వరితగతిన నయం చేసేందుకు వీలయ్యేది. ఈ విధానానికీ కూటమి ప్రభుత్వం మంగళం పాడింది.

ఇంటికి చేరని వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే వైద్యాన్ని తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఆస్పత్రులకు రాలేని, మంచం పట్టిన రోగుల్ని క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకుని, ఫ్యామిలీ డాక్టర్‌ను వారింటికే పంపి, వైద్యపరీక్షలు, వైద్యం అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యామిలీ డాక్టర్ విధానం మూలకు చేరింది. మంచానికే పరిమితమైన రోగులు వైద్య సేవలకు ఆస్పత్రులకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలేవీ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి వార్డులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేవారు. వివిధ రకాల స్పెషలిస్టు వైద్యుల్ని రప్పించి, స్థానిక ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, ఉచిత మందులు, కళ్ల ద్దాలు అందించేవారు. శస్త్ర చికిత్సలు అవసరమయ్యే వారిని ఆరోగ్యశ్రీ పథకంలో వారు కోరుకున్న ఆస్పత్రికి రిఫర్ చేసేవారు. నెలకు సరిపడా మందుల్ని ఒకేసారి అందించేవారు. దీంతో ప్రజలు తమ ఆరోగ్యంపై ధీమాగా ఉండేవారు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్న భరోసా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటి జాడ కూడా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పేదల ఆరోగ్యంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



కదలలేని పరిస్థితిలో ఉన్న రోగికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గాజువాక పీహెచ్‌సీలో కేంద్ర బృందం



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న వైద్య బృందం

గాజువాక: మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగానికి చెందిన పాపులేషన్ రీసెర్చ్ కమిటీ (కేంద్ర బృందం) గాజువాక పీహెచ్‌సీను బుధవారం సందర్శించింది. డాక్టర్ యడ్ల రమణ, డాక్టర్ సీహెచ్ పాదాలు నేతృత్వంలో పీహెచ్‌సీకి వచ్చిన బృందం.. కిశోర బాలికలకు, బడి ఈడు పిల్లలకు ప్రతివారం ఐరన్ మాత్రలు, ఏడాదికి రెండు సార్లు నులి పురుగుల మాత్రల పంపిణీ, శుక్ర, శనివారాల్లో కిశోర బాలికలకు అవసరమైన వైద్య పరీక్షలు, మానసిక, లైంగిక విద్యపై అవగాహన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర రావు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగ అప్పారావు, సిబ్బంది శాంతిప్రియ, వాసు, లోవరాజు, రాణి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధగయ క్షేత్రం యాక్ట్-1949 రద్దు చేయాలి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విశాఖ బౌద్ధ సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: బుద్ధుడు జన్మించిన బుద్ధ గయ మహావీర్ క్రీస్తు పూర్వం నుంచి బౌద్ధులకు సందర్శన కేంద్రంగా మారిందని, అటువంటి బుద్ధ గయలో హిందువుల ఆధిపత్యం కొనసాగించే 1949 చట్టాన్ని రద్దు చేయాలని విశాఖ బౌద్ధ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించాయి. ఆ చట్టం ప్రకారం బుద్ధ గయ ఆలయ కమిటీలో 5గురు హిందువులు, 4గురు బుద్ధిస్టులు ఉండడంతోపాటు జిల్లా మెజిస్ట్రేట్‌ను చైర్మన్‌గా కొనసాగించడం వల్ల బౌద్ధారామంపై హిందువుల ఆధిపత్యం పెరిగిందన్నారు. ఇది బౌద్ధ మతానికి చెందిన వారిని కించపరచేలా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా బౌద్ధ సంఘాల ప్రతినిధులు మోటూరి శ్రీనివాసరావు, కేబీఆర్ అంబేడ్కర్, పాల్తేటి పెంటారావు, బీవీవీ రమణ, బాల భాస్కరరావు, కుమ్మకూరి రమేష్, పట్నాల రాజు, బి.గణపతి, ఎన్.బాలరాజు, మోహనరావు, రేబాక సతీష్, పెద్దాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. షిర్డీసాయి శాంతిధామం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్ షిర్డీ సాయి శాంతి ధామం 11వ వార్షికోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయి బాబాను ప్రత్యేకంగా అలంకరించి, కాగడ హారతి, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చక్కెరాభిషేకం భక్తుల స్వహస్తాలతో చేయించారు. మందిర కమిటీ ప్రతినిధులు కలశాలను ఊరేగించారు. అనంతరం మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం పరస సందడిగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. డీఎల్ రెడ్డి, గున్నేశ్వరరావు, వైవీ రమణ, బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

అగనంపూడి: వైద్య, ఆరోగ్య శాఖలో కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలని ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గీతారాణి, మీసాల సూర్య శంకరరరావు కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2లో చేరి అదే కేడర్‌లో పదవీ విరమణ పొందడం బాధాకరమన్నారు. పదేళ్ల క్రితం ఇదే ప్రభుత్వం గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించి, ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులు సృష్టించి, పదోన్నతులతో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ కార్యరూపం దాల్చ లేదన్నారు. అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్న సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పదోన్నతులు, జోనల్ క్యాడర్‌గా మార్పు, పీహెచ్‌సీల్లో రెండవ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ప్రజల గొంతుక వైఎస్సార్‌సీపీ

- ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీనే కోరుకుంటున్నారు–తిప్పల నాగిరెడ్డి
- వాడవాడలా ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: పీడిత ప్రజల గొంతుకగా.. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ పార్టీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగాజువాకలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి యువత పోరు కార్యక్రమానికి వెళ్లనున్న కార్యకర్తల ర్యాలీని ప్రారంభించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలనుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్నారన్నారు. జగన్ చెప్పారంటే చేస్తారు అనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆక్షేపించారు. దీనిపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్, నాయకులు పల్లా చినతల్లి, కొయ్య భారతి, ధర్మాల శ్రీను, సిరట్ల శ్రీనివాస్, పూర్ణానంద శర్మ, పేరం రామకృష్ణారెడ్డి, మంత్రి శంకర నారాయణ, జీలకర్ర నాగేంద్ర, గొందేశి మహేష్‌రెడ్డి, ఎన్నేటి రమణ, బోగాది సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 70వ వార్డులో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పీతల శ్రీను, సీలాతి అచ్చిబాబు, బాబులునాయుడు, కె.ఎస్.నాయుడు, చట్టి అప్పలరాజు, కుమార్, కోటి, రవికుమార్, గోపి, రమణ, రామాచారి, రాములమ్మ, రాజ్యవరలక్ష్మి, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక నాయకులు పార్టీ జెండాలను ఎగురవేసి, దివంగత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- 87 వార్డు పార్టీ కార్యాలయంలో కోమటి రమాదేవి పార్టీ జెండాను ఆవిష్కరించారు. వడ్లపూడి ఈశ్వరరావు, రమేష్ జకారియస్, సుందరమూర్తి, విజయ్‌కుమార్, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- అప్పికొండ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ నాయకులు ఎన్నేటి రమణ వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి, కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. వి.దానప్పలు, బొండా గోవిందరాజులు, గాలి నూకరాజు, ఎస్.పార్వతి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.
- వడ్లపూడి సీడబ్ల్యూసీ జంక్షన్లో పార్టీ జెండాను 87 వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్ ఎగురవేసారు. కార్యక్రమంలో చిత్రాడ వెంకటరమణ, ప్రగడ శ్రీనివాసరావు, గోవిందరాజులు, మొదినాయుడు, శ్రావణ్, రమణమ్మ పాల్గొని వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెదగంట్యాడ: దివంగత మహానేత వైఎస్సార్ ఆశయ సాధన కోసమే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో బుధవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు కొయ్య భారతి, వెంపాడ అప్పారావు, రోజారాణి, మంత్రి శంకరనారాయణ, పిట్టా రెడ్డి, వెంకటేష్, కాకినాడ పెంటారావు, డాక్టర్ ఎస్ రాజారావు, గొందేశి రాము, గొందేశి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ పేదలకు జ్యూట్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. 68వ వార్డు మిందిలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకటిన్నర దశాబ్దాల కాలంలో ప్రజలకు అతి చేరువై చరిత్ర సృష్టించిన పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలిచిందన్నారు.



87 వార్డులో జెండాను ఆవిష్కరిస్తున్న రమాదేవి



70వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ చందు



పెదగంట్యాడ జంక్షన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



అప్పికొండ కాలనీలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



సీడబ్ల్యూసీలో జెండా అవిష్కరిస్తున్న బొడ్డ గోవింద్



జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న గుడివాడ లతీష్

ఉత్సాహంగా ఎన్టీపీసీ గ్రామీణ క్రీడా పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ



హోరాహోరీగా బాలికల కబడ్డీ పోటీలు

అగనంపూడి: ఎన్టీపీసీ ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. పావురాలు ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, త్రోబాల్‌తోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏజీఎం ఆత్రో, మేనేజర్ ప్రకాశరావు, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కె.ఎం.నాయుడు, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనకారావు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు, 14 హైస్కూళ్లకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో పోలీసుల అదుపులో ఇద్దరు



లారీ పక్క భాగం అద్దాలు పగులగొట్టిన దొంగలు

అక్కిరెడ్డిపాలెం: రాత్రుళ్లు లారీలను రోడ్డు పక్కన నిలిపి, నిద్రిస్తున్న డ్రైవర్లను బెదిరించి వారి నుంచి నగదు, సెల్ ఫోన్లను దొంగిలిస్తున్న కేసుల్లో ఇద్దరు అనుమానితులను గాజువాక క్రైం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. ఒడిశాకు చెందిన అభిషంత్(35) సర్దార్ నెస్ట్ రోడ్డులో, జార్ఖండ్‌కు చెందిన ఇలియాజ్(32) వై జంక్షన్ రోడ్డులో బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో రోడ్డు పక్కన తమ లారీలను పార్క్ చేసి పడుకున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు వారి లారీ వద్దకు చేరుకుని డోర్ కొట్టి డ్రైవర్లను లేపే ప్రయత్నం చేశారు. డ్రైవర్లు డోర్ తియ్యకపోవడంతో లారీల అద్దాలు పగుల గొట్టడంతో భయాందోళనతో డ్రైవర్లు డోర్లు తెరిచారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు అభిషంత్‌పై దాడి చేసి రూ.2 వేల నగదు, 2 సెల్ ఫోన్లు, ఇలియాజ్ నుంచి రూ.1500 నగదు, సెల్ ఫోన్ లాక్కున్నారు. ఇద్దరు డ్రైవర్ల ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. మదీనాబాగ్‌కు చెందిన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై మరమ్మతులతో నిలిచిన ట్రాఫిక్



సగం రోడ్డు మూసి చేపడుతున్న మరమ్మతులు (ఇన్‌సెట్) వంతెనపై సగం వరకు తవ్విన రోడ్డు

అగనంపూడి: అగనంపూడి–లంకెలపాలెం మధ్య రెండు కిలోమీటర్ల నిడివిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అగనంపూడి వంతెనపై మరమ్మతుల కోసం సగ భాగం తవ్వకాలు చేపట్టడంతో కేవలం ఒక వాహనం వెనుక మరో వాహనం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు ట్రాఫిక్ జామ్‌లో వాహనాలు చిక్కుకున్నాయి. లంకెలపాలెం కూడలి నుంచి వంతెన వరకు అసలు ట్రాఫిక్ ఎందుకు నిలిచిపోయిందో తెలియక వాహనదారులు చిరాకు పడ్డారు. సుమారు 4 గంటల పాటు ఇదే పరిస్థితి. రాత్రి 7 గంటలు దాటాక కూడా పనులు కొనసాగించడంతో మరింత ట్రాఫిక్ చిక్కులు వచ్చాయి.